క్లుప్తంగా

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్‌లో తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుడు హరీశ్‌గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం హరీశ్‌గౌడ్ కుటుంబాన్ని జగిత్యాల ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఎక్స్‌గ్రేషియో కింద రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు.

జీవన్‌రెడ్డి గెలవాలని పూజలు



ముడుపు కడుతున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపొందాలని మెట్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయంలో పూజలు చేసిన నేతలు, ఆలయంలో ముడుపు కట్టారు.అనంతరం పలువురు మాట్లాడుతూ ఎంపీగా జీవన్ రెడ్డి గెలుపొందితే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు రామానుజన్‌రెడ్డి, జంగ స్వామి, రాజేందర్, ప్రతాప్‌రెడ్డి, నగేశ్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కోరుట్ల: డిగ్రీ విద్యార్థులు పీజీ ఎంట్రెన్స్ కోసం కళాశాలలో నిర్వహించే ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి వాసవి అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పీజీ ఎంట్రెన్స్ బీకాం ఉచిత కోచింగ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

1.45 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా యాసంగి సీజన్‌లో 1.45 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శనివారం తెలిపారు. భూషణరావుపేటలోని సహకార సంఘం కార్యాలయంలో మాట్లాడారు. సహకార సంఘం తరుపున రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలుండాలని 12 గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహణకు రైతులు సహకరించడం అభినందనీయమన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న సుధాకర్

పెగడపల్లి: మండలంలోని రామభద్రునిపల్లి సాయిబాబా ఆలయ అభివృద్ధి కోసం పెగడపల్లి గ్రామానికి చెందిన బొమ్మెన సుధాకర్ రూ.10 వేల విరాళం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో గంగారెడ్డి, మాజీ సర్పంచులు రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రావు, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

పరామర్శ

కొండగట్టు: కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఒడ్నాల రాజయ్య భార్య మల్లవ్వ అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను శనివారం నాయకులు ఏలేటి కమలకర్‌రెడ్డి పరామర్శించి 10వేల ఆర్థిక సాయం అందించారు.కార్యక్రమంలో ముత్యంరెడ్డి,గోల్కొండ రాజు,మహిపాల్,సాయి ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల లేమి..

- ఏడాదిగా నిలిచిన పట్టణ ప్రగతి నిధులు
- కుంటుపడిన అభివృద్ధి
- 15వ ఫైనాన్స్ నిధులతోనే నెట్టుకొస్తున్న వైనం



రాయికల్ మున్సిపల్ కార్యాలయం

రాయికల్: మున్సిపాలిటీకి గత ఏడాది నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. 2018లో ఆగస్టు 2న మున్సిపాలిటీగా మారింది. పట్టణంలో 12 వార్డులు,4680 గృహాలున్నాయి. పట్టణాన్ని సుందరీకరించేందుకు చెత్త సేకరణ కోసం 24 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఆరు ఆటోలు, మూడు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఈ వాహనాలకు ప్రతినెల సుమారు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఇంధనం ఖర్చవుతుంది.

గతేడాది జూన్ నుంచి నిధులు లేవు..

రాయికల్ మున్సిపాలిటీకి పట్టణ ప్రగతిలో గత ప్రభుత్వ హయాంలో నెలకు రూ.5.46 లక్షలు నిధులు మంజూరయ్యేవి. కాగా, గత ఏడాది జూన్ నుంచి నెలనెలా మంజూరు కావాల్సిన పట్టణ ప్రగతి నిధులు మంజూరు కాకపోవడంతో పట్టణ సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా ఈ నిధుల ద్వారా బల్దియాలోని పలు వార్డుల్లో రోడ్ల మరమ్మతులు, శానిటేషన్ నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుద్దీపాల వినియోగం, వైకుంఠధామం నిర్వహణ, హరితహారం, డంపింగ్‌యార్డుల అభివృద్ధి, పబ్లిక్ టాయిలెట్స్ వంటి పనులను చేపట్టాల్సి ఉంది. ఏడాదిగా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరయ్యే 15వ ఫైనాన్స్ నిధులు మాత్రమే రాయికల్ బల్దియాకు దిక్కయ్యాయి. ప్రతీ ఏడాది బల్దియాకు మంజూరయ్యే 15వ ఫైనాన్స్ రూ.80 లక్షల నిధులే దిక్కయ్యాయి. వీటితో పట్టణంలో తాగునీరు, శానిటేషన్, వాహనాల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు.

ఆదాయం తక్కువ... వ్యయం ఎక్కువ

రాయికల్ మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే మార్గాలు లేకపోవడంతో, కేవలం ఆస్తిపన్ను, నీటి పన్ను, ట్రేడ్‌లైసెన్స్, భవన నిర్మాణాల కింద ప్రతి ఏటా రూ.2 కోట్లు అంచనా వేయగా కేవలం రూ.1.25 కోట్లు మాత్రమే నిధులు సమకూరుతున్నాయి. ఈ నిధుల ద్వారా 24 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి రూ.16,600 చొప్పున, మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు, ఇందన వినియోగం కోసం ఈ నిధుల నుంచి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని పట్టణ ప్రజలు, కౌన్సిలర్లు కోరుతున్నారు.

అభివృద్ధి కుంటుపడుతోంది



రాయికల్ లాంటి చిన్న మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులు నిలిచిపోవడంతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతోంది. బల్దియాలోని పలువార్డుల్లో శానిటేషన్, హరితహారం, తాగునీటి సౌకర్యానికి గతంలో ప్రాధాన్యత ఇచ్చాం. ప్రస్తుతం నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

– మోర హన్మండ్లు మున్సిపల్ చైర్మన్

ఏడాదిగా నిధులు మంజూరు కాలేదు



రాయికల్ మున్సిపాలిటీకి ఏడాది నుంచి పట్టణ ప్రగతి నిధులు మంజూరు కాలేదు. దీంతో పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజలపై పన్నుల రూపంలో వసూలు చేస్తున్నాం. నిధుల కొరతతో పారిశుద్ధ్య కార్మికులకు సైతం వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అభివృద్ధి పనులు సైతం కుంటుపడుతున్నాయి.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



నర్సింగ్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న అధికారులు

ధర్మపురి: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఇందిర క్రీస్తుకుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం సన్మానించారు. కార్యక్రమానికి డిప్యూటి డీఎం అండ్ హెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు అవంతిక, నరేష్, సిబ్బంది తదితరులున్నారు.

అమర వీరులకు నివాళి

మేడిపల్లి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా భీమారం మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్, పల్లి అర్జున్, చెక్కపెల్లి రఘు, చెన్నమనేని రాకేశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించే ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

శిక్షణతో క్రీడల్లో నైపుణ్యం పెరుగుతుంది



ప్రశంస పత్రాలతో విద్యార్థులు

మెట్‌పల్లి: శిక్షణా శిబిరాల వల్ల క్రీడల్లో నైపుణ్యం పెంపొందుతోందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీబీ మహర్షి అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలోఅసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, రాందాస్, గజెల్లి కార్తీక్, ఆల్‌రౌండర్ గంగాధర్ పాల్గొన్నారు.

రైతు బీమా నామిని వివరాల సేకరణ



వేములకుర్తిలో వివరాలు సేకరిస్తున్న ఏఈవో

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో అంకతి రాజన్న అనే రైతు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు రాజన్నకు రైతుబీమా ఉండటంతో నామిని మల్లవ్వ ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా తదితర వివరాలను ఏఈవో హరీశ్ సేకరించారు. వివరాలను ఉన్నత అధికారులకు పంపిస్తే బీమా డబ్బులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో యామాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజన్న, గుమ్మల రమేశ్, ఆరె రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కల్వకోట యువకులు



రక్తదానం చేస్తున్న యువకులు

మేడిపల్లి: మండలంలోని గుండ్లపల్లికి గ్రామానికి చెందిన మార్గం ఎర్రన్న అనే వ్యక్తికి గుండె ఆపరేషన్ కోసం అత్యవసరంగా రక్తం అవసరం కాగా, సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న మండలంలోని కల్వకోట గ్రామానికి చెందిన ఆదే మహేందర్,చిరుత ప్రశాంత్, కటుకం సాయి, కట్ట విష్ణు, చంద రమేశ్ అనే ఐదుగురు యువకులు శనివారం కరీంనగర్ వెళ్లి రక్తదానం చేశారు.రక్తదానం చేసి నిండుప్రాణం కాపాడిన యువకులకు బంధువులు, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశాలు

రాయికల్: రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 3 సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మంగళారపు మహేశ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇసుక డంపులకు వేలం

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ శివారులో సీజ్ చేసిన ఇసుక డంప్‌కు ఈనెల 3 సోమవారం వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ శనివారం తెలిపారు. సుమారు 10 ట్రిప్పుల ఇసుకను ఈ నెల 3న సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలానికి ప్రకటన జారీ చేశామని తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు రూ.5వేల డిపాజిట్ జమా చేసి రశీదు పొంది పాల్గొనాలని సూచించారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా సాయికృష్ణ



సాయికృష్ణ

కోరుట్ల: కాంగ్రెస్ సేవాదళ్ జగిత్యాల జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన గడ్డం సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ మిద్దెల జితేంద్ర శనివారం నియామక పత్రాన్ని అందజేశారు.తన నియామకానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ మారుతి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు కృష్టారావుకు సాయికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

రాయికల్: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం తహసీల్దార్ ఖయ్యూం, మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ ఆధ్వర్యంలోఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తన నిల్వలు, బిల్ స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఏసీ దగ్ధం

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని నాచుపెల్లి జేఎన్టీయూ ఎస్బీఐలో శనివారం షార్ట్‌సర్క్యూట్ జరిగి, ఏసీ దగ్ధమైంది. ఉదయం బ్యాంకును తెరిచి, ఏసీ ఆన్ చేయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. ఈ ఘటనతో బ్యాంకులో పొగలు వ్యాపించి, కస్టమర్లు ఇబ్బంది పడ్డారు. పెనుప్రమాదం తప్పడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆవిర్భావ వేడుకలకు కార్యాలయాలు ముస్తాబు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలను అందంగా అలంకరించారు. ఇబ్రహీంపట్నంలో మండల పరిషత్ కార్యాలయంతోపాటు వివిధ కార్యాలయంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి తోరణాలు కట్టారు.

మున్నూరు కాపు అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ప్రజాస్వామ్యమైనదే

జగిత్యాల: మున్నూరుకాపు జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ప్రజాస్వామ్యమైనదేనని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఇటీవల జగిత్యాలలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గం హైదరాబాద్‌లో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక రాష్ట్ర కార్యవర్గ అనుమతితోనే జరిగిందని, ఈ ఎన్నికను ఆమోదిస్తున్నామని తెలిపారు. ఇది మహాసభ కాచిగూడకు అనుబంధంగా పనిచేస్తుందని, పూర్తికార్యవర్గాన్ని విస్తరించేందుకు అనుమతిస్తున్నామని తెలిపారు. ఈనెల 9న బీఎల్ఎన్ గార్డెన్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, రాచకొండ శ్రీరాములు, జంగిలి కృష్ణనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



ధర్మపురి ఆలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు



తాళ్ల ధర్మారంలో భక్తుల శోభాయాత్ర



ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



రేగుంటలో భక్తుల పూజలు



ధర్మపురిలో అంజన్న స్వామి దీక్షాపరులు

జగిత్యాల రూరల్/ జగిత్యాల టౌన్/ కోరుట్లరూరల్/ ఇబ్రహీంపట్నం/గొల్లపల్లి/ ధర్మపురి/ మల్యాల/ పెగడపల్లి/మల్లాపూర్/సారంగాపూర్: జగిత్యాలరూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురి, కోరుట్ల మండలం, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి, మల్లాపూర్, మల్యాల, గొల్లపల్లి, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి విగ్రహాలకు భక్తులు అభిషేకాలు, అర్చనలు చేశారు. పలు చోట్ల అంజన్న చిత్రపటాలతో శోభాయాత్రలు నిర్వహించారు. ఆలయాల్లో అన్నదానం చేశారు.

ఘనంగా పంచముఖ ఆంజనేయస్వామి జాతర

కథలాపూర్: మండలం సిరికొండలో పంచముఖ ఆంజనేయస్వామి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

హనుమాన్ ఆలయంలో గీతాహవన యజ్ఞం



గీతాహవన యజ్ఞంలో దంపతులు

వెల్గటూర్: మండల కేంద్రంలోని శ్రీరామ భక్తాంజనేయ శివలింగ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గీతాహవన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. శ్రీహరి మౌనస్వామి రోటిగూడ ఆధ్వర్యంలో 18 కుండలములచే గీతాహవన యజ్ఞం నిర్వహించారు. గీతా భక్తులు గీతా పారాయణం నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమానికి మండలం లోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ పూజారి నరసింహామూర్తి ఆధ్వర్యంలో పంచకుండాత్మక హనుమత్ కవచహవనం, శివాలయంలో స్వామివారికి అభిషేకములు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేశ్, ఆలయ కమిటీ సభ్యులు,నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జగదేవుపేటలో రక్తదాన శిబిరం

వెల్గటూర్ : మండలంలలోని జగదేవుపేటలో ప్రతిమ ఫౌండేషన్, ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా, సైకిల్ కిల్ వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు రక్త దానంతో కొత్త జీవితం ఇవ్వాలన్న మంచి సంకల్పంతో రక్తదానం చేసినట్లు జగదేవుపేట గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో యువకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రతిమ హాస్పిటల్, పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన అంబటి ద్యావతి లింగం అనే యువకుడు ఇటీవలే రోడ్డుప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితుడికి చికిత్స నిమిత్తం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ముస్కు రాము రూ.15 వేలు దుబాయి నుంచి పంపించగా, అతని మిత్రులు బాధితుడు లింగంకు ఇచ్చారు. రాముకు సమాచారం ఇచ్చి ఆర్థికసాయం ఇప్పించిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం..

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేటలో పస్తం రాజం అనే వ్యక్తి వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా, బాధిత కుటుంబానికి వెంకట్రావుపేట ఆది యువసేన నాయకులు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి వరుణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా వనప్రభను పకడ్బందీగా నిర్వహించాలి

మెట్‌పల్లి: హరితహారం స్థానంలో అమలు చేస్తున్న ఇందిరా వనప్రభ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్వహించాలని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడే జెట్టి లింగం కోరారు. పట్టణంలో శనివారం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన హరితహారంలో కోట్లాది రుపాయల ప్రజాధనం దుర్వినియోగమైందన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో వాసం భీమయ్య శనివారం పరిశీలించారు. మండలంలోని కోమన్‌పల్లి, రేకులపల్లి, చెర్లపల్లి, మంగేళ గ్రామాల్లో చేపట్టిన పనుల ప్రగతిని పరిశీలించి పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

బెదిరింపు ఆరోపణలు అవాస్తవం

మెట్‌పల్లి: పట్టణంలోని అర్బన్ హౌజింగ్ కాలనీకి చెందిన ఖాజా మోహినుద్దీన్ అనే వృద్ధున్ని తాను బెదిరించాననడంలో వాస్తవం లేదని మాజీ కౌన్సిలర్ ఎండీ షాకీర్ శనివారం తెలిపారు. మోహినుద్దీన్ కాలనీలో ఉన్న మసీదుకు సంబంధించిన డబ్బులను సొంతానికి వాడుకున్నాడన్నారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకున్నందుకు బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులతో కలిసి తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన అంబల్ల ప్రతాప్‌రెడ్డి కోళ్లఫాం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి కాగా, శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరిశీలించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఒడ్డెలింగాపూర్‌లోని గీత కార్మికుడు హరీశ్‌గౌడ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియో అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, నాయకులు ఉన్నారు.